ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 కర్నూలు జిల్లా వార్తలు

ఆదివారం 7 ఏప్రిల్ 2024



రంజాన్ వేళలు



	ఇఫ్తార్(ఆదివారం)	సెహరీ(సోమవారం)
కర్నూలు	6:37 (సాయంత్రం)	4:45 (ఉదయం)
ఎమ్మిగనూరు	6:34 (సాయంత్రం)	4:58 (ఉదయం)
ఆదోని	6:38 (సాయంత్రం)	4:44 (ఉదయం)

పండగ వచ్చె.. సందడి తెచ్చె..!

- శ్రీగిరిపై ఉగాది మహోత్సవాలు ప్రారంభం
- భృంగి వాహనంపై విహరించిన స్వామి, అమ్మవార్లు
- మహాలక్ష్మిగా దర్శనమిచ్చిన భ్రమరాంబికాదేవి
- నేడు స్వామిఅమ్మవార్లకు కైలాస వాహన సేవ,
- మహాదుర్గగా దర్శనమివ్వనున్న అమ్మవారు
- భక్తులతో కిటకిటలాడి శ్రీశైల క్షేత్రం

శ్రీశైలం, ఏప్రిల్ 6: శ్రీశైల మహాక్షేత్రంలో శనివారం ఉగాది మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉగాది మహోత్సవాలు 10న ముగియనున్నాయి. ఉదయం ఆలయ ప్రాంగణంలోని స్వామివారి యాగశాల ప్రవేశంతో ఉత్సవాలు మొదలయ్యాయి. ఆలయ కార్యనిర్వహణాధికారి, స్థానాచార్యులు, అర్చకులు, వేదపండితులు, అధికారులు సంప్రదాయబద్ధంగా యాగశాల ప్రవేశం చేశారు. తరువాత వేదపండితులు చతుర్వేద పారాయణాలతో వేదస్వస్తి నిర్వహించారు. ఆ తరువాత దేశం శాంతి సౌభాగ్యాలతో విలసిల్లాలని ఆలయ అర్చకులు, వేదపండితులు లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. దీనికే శివ సంకల్పం అని పేరు. ఉత్సవాలు నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి పూజలు నిర్వహించారు. సాయంకాలం అంకురార్పణ కార్యక్రమం జరిపించారు.

భృంగి వాహనంపై స్వామి, అమ్మవార్ల విహారం

ఉగాది మహోత్సవాల్లో భాగంగా మొదటి రోజు శనివారం స్వామిఅమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించారు. అర్ధనారీశ్వర రూపానికి మూలకారకుడైన భృంగి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల సేవలో తరించారు. భృంగి వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులనుజేసి సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం క్షేత్ర పురవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. అశేష భక్తజనం ఈ అద్భుత ఘట్టాన్ని కనులారా వీక్షించి పరవశించారు. గ్రామోత్సవం ముంగిట శంఖం, జే గంట, ఢమరుకం, కొమ్ము వాయిద్యం, కోలాటం, చెక్కభజన, వేషధారణలు, తప్పెట్లు, శంఖానాదాలు, కర్ణాటక జాంజ్, కర్ణాటక డోలు విన్యాసాలు, మంగళవాయిద్యాలతో కొనసాగింది. రాజగోపురం నుంచి గంగాధర మండపం మీదుగా బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవ క్రతువు జరిగింది.



భృంగి వాహనంపై విహరిస్తున్న స్వామి, అమ్మవారు





సంప్రదాయ నృత్య ప్రదర్శనలో మహిళలు, చిన్నారులు



కర్ణాటక సంప్రదాయ నృత్య ప్రదర్శన



కళాకారుల ప్రదర్శన



మహాలక్ష్మిగా భ్రమరాంబికాదేవి

ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు అమ్మవారు మహాలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. చతుర్భుజాలు కలిగిన ఈదేవి పైరెండు చేతులలో పద్మాలను, కింది చేతులలో కుడి వైపు అభయహస్తం, ఎడమ వైపు వరముద్రతో దర్శనం ఇచ్చారు.

నేడు కైలాసవాహన సేవ: ఉగాది మహోత్సవాల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం స్వామివారికి విశేష అర్చనలు, మహాశక్తి స్వరూపిని అయిన భ్రమరాంబిక దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు.

సాంస్కృతిక కార్యక్రమాలు: ఉగాది మహోత్సవాల సందర్భంగా దేవస్థానం పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా శనివారం సాయంత్రం కూచిపూడి నృత్యం, సంప్రదాయ నృత్యం, ఆధ్యాత్మిక ప్రవచనం, వేణుగాన కచేరి, తబలా కచేరి, భక్తి సంగీత విభావరి తదితర కార్యక్రమాలను నిర్వహించింది.

వైసీపీ పాలనలో ముస్లింల పథకాలన్నీ రద్దు

- టీడీపీతోనే సంక్షేమం, అభివృద్ధి
- రంజాన్ తోఫా, దుల్హన్ పథకాలను రద్దు చేసిన జగన్
- నంద్యాలలో ముస్లిం మహిళలతో భువనేశ్వరి సమావేశం







సమావేశానికి హాజరైన ముస్లిం మహిళలు

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 6: టీడీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలకు ప్రవేశ పెట్టిన పథకాలన్నింటినీ జగన్‌మోహన్‌రెడ్డి రద్దు చేశారని నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా నంద్యాలకు వచ్చిన ఆమె శనివారం ముస్లిం మైనారిటీ మహిళలతో మాటామంతీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం మైనారిటీలకు ఏం చేసిందని ప్రశ్నించారు. అబ్దుల్‌సలామ్ అనే వ్యక్తి తన కుటుంబంతో రైలు పట్టాలపై పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటనను ఆమె గుర్తు చేశారు. టీడీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనారిటీలకు రంజాన్ తోఫా, దుల్హన్ పథకం, ముస్లిం కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ లోన్లు, దూదేకుల కార్పొరేషన్ నుంచి రూ.కోట్లలో నిధుల సమకూర్పు, అంబేడ్కర్ ఓవర్‌సీస్ విద్యా విధానం, ఎన్‌టీఆర్ ఉన్నత విద్యాదరణ, ఇమామ్‌లకు, మౌజాన్‌లకు గౌరవ వేతనం అందించిన ఘనత టీడీపీదేనని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ముస్లింలు ఎదుర్కొంటున్న సమస్యలను మహిళలు భువనేశ్వరి దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, మాజీ మంత్రి, నంద్యాల అభ్యర్థి ఎన్ఎండీ ఫరూక్, మాజీ మంత్రి ఆళ్లగడ్డ అభ్యర్థి భూమా అఖిలప్రియ, మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నరసింహులు కుటుంబాన్ని పరామర్శించి భరోసాపత్రాన్ని అందజేస్తున్న నారా భువనేశ్వరి

'ఆలోచించి ఓటు వేయండి'



నరసింహులు కుటుంబ సభ్యులతో నారా భువనేశ్వరి, పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత



కల్లూరులో ప్రసంగిస్తున్న నారా భువనేశ్వరి, పక్కనే గౌరు చరిత

కల్లూరు: ప్రజలు ఆలోచించి ఎన్నికల్లో ఓటు వేయాలని నారా భువనేశ్వరి అన్నారు. శనివారం నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా కల్లూరు అర్బన్ 37వ వార్డులో పర్యటించారు. నియోజకవర్గ ప్రజలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు నాయుడు అరెస్టును జీర్ణించుకోలేక మృతి చెందిన బోయ నరసింహులు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆ కుటుంబాకి టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ప్రజలతో ఆమె మాట్లాడుతూ గంజాయి, ఇసుక, కల్తీ మద్యం వ్యాపారంలో ఏపీ నెంబర్ వన్ స్థానంలో ఉందని అన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన జెండాల అజెండా ఒక్కటేనని, ప్రజల ప్రభుత్వం రావాలన్నదే కూటమి లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో పాణ్యం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే గౌరుచరిత, నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మ టీడీపీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నమాసుం కుటుంబానికి పరామర్శ

నందికొట్కూరు: కార్యకర్తలే టీడీపీకి బలమని నారా భువనేశ్వరి అన్నారు. నిజం గెలవాలి యాత్ర శనివారం నందికొట్కూరు నియోజకవర్గం మిడ్తూరు మండలంలో ఆమె పర్యటించారు. మిడ్తూరు మండలం నాగలూటి గ్రామంలో టీడీపీ కార్యకర్త చిన్నమాసుం కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, నంద్యాల జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, నంద్యాల ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి, పాణ్యం, నందికొట్కూరు అభ్యర్థులు గౌరు చరితారెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి జయసూర్య పాల్గొన్నారు.

ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 6: రాష్ట్రంలో త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికలను శాంతియు తంగా, స్వేచ్ఛగా, చట్టబద్ధంగా నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులు, ఎస్పీలపైనే ఉంటుందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా పేర్కొన్నారు. శనివారం రాష్ట్ర సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, పోలీసు సూపరింటెండెంట్లు, పోలీసు కమిషనర్లతో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లు, తీసుకుంటున్న చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎటువంటి హింసకు, రీ పోలింగ్‌కు తావు లేకుండా పటిష్ఠమైన భద్రత చర్యలను చేపట్టాలన్నారు. గంజాయి, లిక్కర్, నగదు, ఉచితాల అక్రమ రవాణపై పటిష్ఠమైన నిఘా ఉంచాలన్నారు. ఇంటింటి ప్రచారానికి సంబంధించి ముందస్తు సమాచారాన్ని ఆర్వోకు సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలకు తెలియజేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ జి.సృజన, ఎస్పీ జి.కృష్ణకాంత్, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సృజన, ఎస్పీ కృష్ణకాంత్

10 నుంచి మలి విడత శిక్షణా తరగతులు

కర్నూలు(కలెక్టరేట్), ఏప్రిల్ 6: జిల్లాలో పీవో, ఏపీవో, ఓపీవోలకు ఈ నెల 10వ తేదీన అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా రెండో విడత శిక్షణా తరగతులు ప్రారంభం కానున్నాయి. కోడుమూరు, పాణ్యం నియోజకవర్గాలకు మాత్రం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మిగతా నియోజకవర్గాలకు అన్నీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణా తరగతులు నిర్వహించనున్నారు. పీవో, ఏపీవో, ఓపీవోల నియామక ఉత్తర్వులు అందిన ప్రతి ఒక్క అధికారి శిక్షణా తరగతులకు తప్పనిసరిగా హాజరుకావాలని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

ఆరోగ్యమే మన సంపద

- ఆనందంగా ఉండాలంటే మంచి జీవన శైలి
- నేడు వరల్డ్ హెల్త్ డే



కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 6: కాలుష్యం, ఆహార కొరత వల్ల పేదలకు అనారోగ్యం ఒక పెద్ద సామాజిక సమస్యగా మారింది. మందుల వినియోగం పెరగడంతో వచ్చే సైడ్ ఎఫెక్ట్ వల్ల కూడా వ్యాధులు పెరుగుతున్నాయి. మధ్య తరగతి ప్రజలకు జీవన శైలి మారడంతో తరచూ ఆస్పత్రులపాలవుతున్నారు. ఆరోగ్యంగా ఉంటేనే ఆనందంగా జీవిస్తారు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడానికి డబ్ల్యూహెచ్‌వో ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహిస్తుంది. . ఈ ఏడాది నా ఆరోగ్యం.. నా హక్కు అన్న నినాదాన్ని డబ్ల్యూహెచ్‌వో ఇచ్చింది.

ఆరోగ్యమే మహా భాగ్యమని అంటారు. అనారోగ్యానికి పేదరికం కారణం. పర్యావరణ విధ్వంసం మరో ముఖ్యమైన కారణం. వైద్య విధానం, మందుల వల్ల కలిగే వైపరీత్యాలు వ్యాధులను పెంచుతున్నాయి. వీటితో పాటు ప్రజలు తమ చేతిలో ఉన్న కొన్ని సమస్యలను పరిష్కరించుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు. ఆ విషయాలు వైద్యులు ఇలా చెబుతున్నారు.

ఆరోగ్యకరమైన అలవాట్లు తప్పనిసరి



వాతావరణ సంక్షోభం వల్ల స్వచ్ఛమైన గాలి దొరకడం లేదు. ఇండోర్, అవుట్‌డోర్‌లో వాయు కాలుష్యం ప్రభావంతో ప్రతి 5 సెకన్లకు ఒకరు కాలుష్య ప్రభావానికి గురవుతున్నారు.

- డా.వై. దివ్యలత, జనరల్ ఫిజీషియన్, కిమ్స్ హాస్పిటల్, కర్నూలు



- **ఇవి చేయండి:** ప్రతి రోజు 8 గ్లాసుల నీటిని తాగేలా చూసుకోవాలి. ఇది జీర్ణక్రియకు సహాయ పడుతుంది. చర్మ ఆరోగ్యానికి, శరీరం ఉష్ణోగ్రత నియంత్రించేందుకు ఉపయోగపడుతుంది.
- **సమతుల్య భోజనం:** మనిషి సమతుల్య భోజనాన్ని ప్రతిపూట తినాలి. తినే భోజనంలో ప్రొటీన్లు, ఫైబర్, ఐరన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు, ఖనిజాలు అన్ని ఉండేలా చూసుకోవాలి.
- **వ్యాయామం:** భోజనం తిన్న తర్వాత ఎముకలు, కండరాలు బలంగా ఉండాలంటే శారీరక శ్రమ చేయాలి. శారీరక శ్రమ చేయడం వల్ల మానసిక స్థితి కూడా మెరుగవుతుంది.
- **తగినంత నిద్ర:** ప్రతి మనిషికి తగినంత నిద్ర లేకుంటే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. మానసిక ధృఢత్వాన్ని కూడా నిద్ర ప్రభావితం చేస్తోంది. నిద్రలేమి వల్ల చాలా మంది అనారోగ్యాలబారిన పడుతున్నట్లు ఒక సర్వేలో తేలింది.
- **మద్యం, ధూమపానం వద్దు:** ఎంతో మందికి మద్యం, ధూమపానం తాగే అలవాటు ఉంది. ఆల్కహాల్ వల్ల లివర్ దెబ్బతిని కొన్ని క్యాన్సర్లు వచ్చే అవాకాశం ఉంది.
- **హెల్త్ చెకప్:** కొన్ని రకాల అనారోగ్య సమస్యలు ఎలాంటి లక్షణాలు చూపించవు. కాబట్టి ముందస్తుగా కొన్ని రకాల హెల్త్ చెకప్‌లు చేయించుకోవాలి.

ప్రజలందరికీ ఆరోగ్యం



ప్రజలందరూ ప్రశాంతమైన వాతావరణంలో సంతోషకరమైన జీవితాన్ని గడపాలి. నా ఆరోగ్యం.. నా హక్కు అన్న థీమ్‌ను ప్రపంచ ఆరోగ్య సంస్థ నినాదాన్ని ఇచ్చింది. వరల్డ్ హెల్త్ డే సందర్భంగా అన్ని పీహెచ్‌సీ, అర్బన్ హెల్త్ సెంటర్లలో సదస్సును నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశాలు జారీ చేశారు.

- డా.వై.ప్రవీణ్ కుమార్, డీఎంహెచ్‌వో, కర్నూలు

మారుతున్న జీవనశైలి



ఇటీవల కాలంలో జీవనశైలి మారుతున్నది. ఈ కారణంగా చాలా మంది వ్యాధులకు గురవుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాల్లో ప్రమాకరమైన ఆరోగ్య అంశాల్లో అవగాహన కల్పించేందుకు ప్రతి ఏడాది డబ్ల్యూహెచ్‌వో వరల్డ్ హెల్త్ డే నిర్వహిస్తుంది.

- డా. సరయురెడ్డి, జనరల్ ఫిజీషియన్, కర్నూలు మెడికవర్ హాస్పిటల్

యువతా మేలుకో..!

- ఏప్రిల్ 15 వరకు కొత్తగా ఓటు నమోదుకు అవకాశం
- జాబితాలో పేరుందో లేదో చూసుకోవాల్సిన బాధ్యత ఓటరుదే
- లేకపోతే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా నమోదుకు వెసులుబాటు
- ఇప్పటి వరకు నంద్యాల జిల్లాలో 13,72,091 ఓటర్లు

ఆత్మకూరు, ఏప్రిల్ 6: ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటే వజ్రాయుధం. తమను పాలించే నాయకుడిని తామే నేరుగా ఎన్నుకునేలా 18ఏళ్లు దాటిన పౌరులకు భారత రాజ్యాంగం ఓటు హక్కును కల్పించింది. అయితే చాలా మంది ఓటు నమోదులో నేటికీ అలసత్వాన్ని ప్రదర్శిస్తూనే ఉన్నారు. అందులో ఎక్కువగా విద్యావంతులే ఉండటం దురదృష్టకరం. ఎన్నికల రోజంటే బాధ్యత గల రోజనే విషయాన్ని మరిచి కొందరు ఇంటికే పరిమితమవుతున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో కేంద్రం ఎన్నికల కమిషన్ ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు చేస్తోంది. వాస్తవానికి ఈ ఏడాది జనవరి 22వ తేదీన దేశ వ్యాప్తంగా ఓటరు తుది జాబితాను విడుదల చేసినప్పటికీ ఇంకా మిగిలిపోయిన వారికి కోసం ఏప్రిల్ 15 వరకు కొత్తగా ఓటును నమోదు చేసుకునే అవకాశం కల్పించింది. ఇందుకోసం ఫారం-6తో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లతో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశాన్ని ఇచ్చారు. కాగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చినందున ఓటరు జాబితా నుంచి ఓట్ల తొలగింపునకు, మార్పులకు అవకాశం లేనప్పటికీ కొత్తగా ఓట్లను నమోదు చేసుకునేందుకు మాత్రమే అవకాశం కల్పించారు.

ఆన్‌లైన్‌లో నమోదు ఇలా

ప్లేస్టోర్‌లో భారత ఎన్నికల సంఘానికి చెందిన ఓటరు హెల్ప్‌లైన్ మొబైల్ యాప్ ఉంటుంది. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత మీ ఫోన్ నంబర్ వివరాలు పొందుపరిచి రిజిస్టర్ చేసుకోవాలి. ఆ తర్వాత లాగిన్ అయి ఓటరు రిజిస్ట్రేషన్ విభాగంలోకి వెళ్తే న్యూ ఓటరు ఓటరు రిజిస్ట్రేషన్ ఆప్షన్ కనిపిస్తోంది. దానిపై క్లిక్ చేస్తే దరఖాస్తు ఓపెన్ అవుతోంది. అందులో వివరాలు నమోదు చేసి సబ్‌మిట్ చేయాల్సి ఉంటుంది. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఇన్ వెబ్‌సైట్‌లో మీ ఫోన్ నంబర్‌తో రిజిస్ట్రేషన్ చేసుకుని లాగిన్ అవ్వాలి. రిజిస్టర్ యూజ్ ఏ న్యూ ఓటరు ఆప్షన్‌పై క్లిక్ చేసిన అనంతరం ఫారం-6 దరఖాస్తు ఫర్ న్యూ ఓటర్స్ అని కనిపిస్తోంది. దానిపై క్లిక్ చేస్తే ఆన్‌లైన్ దరఖాస్తు కనిపిస్తోంది. అందులో వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. ఆతర్వాత ఫోన్ నంబర్‌కు రెఫరెన్స్ ఐడీ నంబర్ వస్తుంది. ఆతర్వాత ఆన్‌లైన్ దరఖాస్తు వివరాల ఆధారంగా బూత్‌స్థాయి అధికారి ఇంటి అడ్రస్‌కు వచ్చి పరిశీలన చేస్తారు. అన్ని వివరాలు సక్రమంగా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత ఓటరు జాబితాలో పేరు చేరుస్తారు.





ఆఫ్‌లైన్‌లో ఫారం-6 దరఖాస్తు ఇలా

ఓటు కోసం దరఖాస్తు చేసుకునే వారు బూత్‌స్థాయిలో అధికారులకు ఫారం-6 దరఖాస్తు సమర్పించాల్సి వుంటుంది. అలాగే ప్రతి నియోజకవర్గానికి డివిజన్ స్థాయి అధికారిని ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారిగా ఎన్నికల సంఘం నియమించింది. వారికి కూడా దరఖాస్తులను సమర్పించవచ్చు. అలాగే ప్రతి మండలంలో తహసీల్దార్ లేదా డిప్యూటీ తహసీల్దార్‌ను సంప్రదించి దరఖాస్తులను ఇచ్చి ఓటు నమోదు చేసుకోవచ్చు. ఓటు నమోదుకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌ను సంప్రదించవచ్చు. ఇదిలావుంటే కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలు ఆయా పోలింగ్ బూతుల ఓటరు జాబితాలో చివరి పేజీలో పొందుపరుస్తారని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఇప్పటి వరకు నంద్యాల జిల్లాలో 13,72,091 ఓటర్లు

నంద్యాల జిల్లాలో పాణ్యం నియోజకవర్గం మినహా మిగతా ఆరు నియోజకవర్గాలకు సంబంధించి ఈ ఏడాది జనవరి 22వ తేదీన కేంద్ర ఎన్నికల కమిషన్ ఓటరు జాబితాను విడుదల చేసింది. ఇందులో నంద్యాల జిల్లా వ్యాప్తంగా 13,72,091 ఓటర్లు ఉండగా అందులో పురుష ఓటర్లు 6,73,425, మహిళా ఓటర్లు 6,98,404, ఇతరులు 262 మంది ఉన్నట్లు వెల్లడించారు.

కొత్తగా ఓటు నమోదు చేసుకోండి



ఓటరు జాబితా తమ ఓటు లేకపోవడం, ఇంకా ఓటు నమోదు చేసుకోకపోతే అలాంటి వారు కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా భారత ఎన్నికల కమిషన్ ఏప్రిల్ 15 వరకు కొత్తగా నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించింది. అయితే ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున ఓటరు జాబితాలో చేర్పులు, మార్పులకు అవకాశం లేదు. కేవలం కొత్తగా ఓటు నమోదు చేసుకునే వెసులుబాటు మాత్రమే ఉంది. ఇందుకోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. మండల స్థాయిల్లో కూడా ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తున్నాం. -సుధారాణి, శ్రీశైలం నియోజవర్గం రిటర్నింగ్ ఆఫీసర్

ఖనిజాన్ని అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 6: ఖనిజాన్ని అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. శనివారం బెంగుళూరు- హైదరాబాద్ జాతీయ రహదారిపై వాహనాల తనిఖీల్లో అక్రమంగా ఖనిజ పౌడర్ కర్ణాటక సరఫరా చేస్తున్న లారీని సీజ్ చేసి రూ 50 వేలు జరిమానా వసూలు చేశాం. వెల్దుర్తి వద్ద ఐచర్ వాహనంలో నాపరాయి అక్రమంగా రవాణ చేస్తుంటే రూ.10 వేలు వసూలు చేశామని రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

డిగ్రీ 3, 5 సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 6: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ 3, 5వ సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎన్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. రెగ్యులర్ విభాగంలో 3వ సెమిస్టర్లో 5,900కు 3081, 5వ సెమిస్టర్‌లో 10,080 కి 5652 మంది సప్లమెంటరీ విభాగంలో 3వ సెమిస్టర్‌లో 9,410కి 4,182 మంది. 5వ సెమిస్టర్‌లో 4,244 మంది పరీక్షలకు హాజరుకాగా 2,229 మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు.

అరటి తోటలో ఎలుగుబంటి మృతి

విద్యుదాఘాతంతో కావచ్చంటున్న అటవీ అధికారులు



మృతి చెందిన ఎలుగుబంటి

మహానంది, ఏప్రిల్ 6 : మహానంది మండలం నల్లమల అటవీ ప్రాంతంలో శనివారం అనుమానాస్పద స్థితిలో ఎలుగుబంటి మృతిచెందింది. మహానందికి సమీపంలోని శంకర తపోవనం పక్కనే ఉన్న అరటి తోటలో ఎలుగుబంటి మృతదేహాన్ని అటవీ సిబ్బంది గుర్తించారు. వెంటనే ఉన్నతాధికార్లకు సమాచారం ఇచ్చారు. అక్కడి నుండి ఎలుగుబంటి మృతదేహాన్ని మహానంది పర్యావరణ విద్యాకేంద్రం పరిసరాలకు తరలించారు. తిమ్మాపురం పశువైద్యాధి కారి కరుణాకర్ పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం సమీపంలోని నల్లమలలో ఎలుగుబంటి మృతదేహాన్ని ఖననం చేసారు. ఎలుగుబంటి విద్యుదా ఘాతానికి గురై మృతి చెంది ఉండవచ్చని పశువైద్యాధికారి కరుణాకర్ నిర్ధారించారు. డీఆర్వో హైమవతి, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాణాప్రతాప్, వీఆర్వోలు సురేంద్రనాథ్ రెడ్డి, శివప్రసాద్‌తో పాటు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉగాది ఉత్సవాలు ప్రారంభం

- సర్వాంగ సుందరంగా కైరుప్పల ఆలయం
- 9న పిడకల సమరం
- 13న మహా రథోత్సవం

ఆస్పరి, ఏప్రిల్ 6: మండలంలోని కైరుప్పల గ్రామంలో వీరభద్ర స్వామి, భద్రకాళి అలయంలో శనివారం నుండి వైభవంగా ఉగాది ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. అందులో భాగంగా నేడు ధ్వజారోహణ నిర్వహిస్తారు. సోమవారం అమావాస్య పూజ కార్యక్రమాన్ని, మంగళవారం ఉగాది పండుగ ప్రత్యేక పూజలు, బుధవారం పెద నుగ్గులాట (పిడకల సమరం), గురువారం తెల్లవారు జామున 4.05 నిమిషాలకు స్వామివారి కళ్యాణోత్సవం, 13న శనివారం సాయంత్రం మహా రథోత్సవం, 14న రాత్రి 8 గంటలకు వీరభద్ర స్వామి సొమ్ము దోచుకోవడం అనే ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. సోమవారం వసంతోత్సవం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి రామ్‌ప్రసాద్ వెల్లడించారు. ఈ సందర్భంగా కైరుప్పల ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు.

ఆదోని మార్కెట్‌కు భారీగా ఎండు మిర్చి

ఆదోని (అగ్రికల్చర్), ఏప్రిల్ 6: ఆదోని వ్యవసాయ మార్కెట్ కమిటీకి శనివారం ఎండు మిర్చి బస్తాలు భారీగా విక్రయానికి రైతులు తీసుకొచ్చారు. కర్ణాటకలోని బ్యాడిగి మార్కెట్ కమిటీలలో వారం రోజులుగా విక్రయాలు నిలిచిపోయాయి. అక్కడికి వెళ్లిన రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. దీంతో వివిధ గ్రామాల నుంచి రైతులు తాము పండించిన ఎండుమిర్చిని ఆదోని మార్కెట్‌కు తీసుకొచ్చారు. ప్లాట్‌ఫారం అంతా ఎటు చూసినా ఎండుమిర్చితోనే కళకళలాడింది. ఒక్కరోజే 4,163 ఎండుమిర్చి బస్తాలను విక్రయానికి రైతులు తెచ్చారు. ధర భారీగా తగ్గిపోయినప్పటికీ ఇంకింత పడిపోతుందేమోనన్న భయంతో విక్రయానికి తీసుకొచ్చారు. కనిష్ఠ ధర రూ.3,000 గరిష్ఠ ధర రూ.13,350 మధ్యస్థ ధర రూ.8,177 పలికింది. బ్యాడికి రకం ఎండుమిర్చి కనిష్ఠ ధర రూ.3,120, గరిష్ఠ ధర, రూ.7,891, తేజ రకం కనిష్ఠ ధర రూ.3,129, గరిష్ఠ ధర రూ.13,350 పలికింది.

రాఘవేంద్రుని సన్నిధిలో కర్ణాటక జడ్జి



మంచాలమ్మ సన్నిధిలో కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ బసవరాజు

మంత్రాలయం, ఏప్రిల్ 6 : కర్ణాటక హైకోర్టు జడ్జి జస్టిస్ బసవరాజు శనివారం మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. శుక్రవారం రాత్రి ఆయన మంత్రాలయంలో బస చేశారు. మహా ముఖ ద్వారం వద్ద మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతి ఆచార్, ఐపీ నరసింహమూర్తి ఘనంగా స్వాగతం పలికారు. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు మెమెంటో, శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. వీరి వెంట తాహసీల్దార్ శ్రీధర్‌మూర్తి, ఏఎస్ఐ ఆనందరెడ్డి, బిందు మాధవ్, అనంతస్వామి, ప్రకాశ్ ఆచార్, భీమ్‌సేన్ ఆచార్, పవన్‌ఆచార్, వ్యాసరాజార్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డులో రైతుపై దాడి

సెక్రటరీకి ఫిర్యాదు చేసిన రైతు



గాయపడ్డ రైతు నాగార్జున

ఆదోని, ఏప్రిల్ 6: ఆదోని వ్యవసాయ మార్కెట్లో పంట దిగుబడిని విక్రయించేందుకు వచ్చిన రైతుపై, అక్కడ పని చేస్తున్న మహిళా కూలీలు తమ దగ్గర ఉన్న ఇనుప చాటలతో దాడికి తెగబడ్డారు. ముఖంపై తగిలిన గాయాలతో సెక్రెటరీ దగ్గర వెళ్లి రైతు ఫిర్యాదు చేశారు. పత్తికొండ మండలం దూదేకొండ గ్రామానికి చెందిన రైతు నాగార్జున తన పొలంలో పండించిన 20 సంచుల వేరుశనగ పంటను విక్రయించడానికి శనివారం ఉదయం ఆదోని మార్కెట్ యార్డ్‌కు తీసుకొచ్చాడు. తమ పంట దిగుబడులకు క్వింటం రూ.5,590 ప్రకారంగా టెండర్ కూడా వేశారు. టెండర్ వేసిన యజమాని వేరుశనగ పంటను శుభ్రం చేయించేందుకు ఐదుగురు మహిళలను పంపించాడు. అక్కడికి వచ్చిన మహిళలు తమకు రూ.500 ఇవ్వాలని రైతును డిమాండ్ చేశారు. అప్పటికే నష్టాల్లో ఉన్న రైతు ఎందుకు ఇవ్వాలంటూ మహిళలను నిలదీశారు. దీంతో వారు ఒక్కసారిగా తమ చేతుల్లో ఉన్న ఇనుప చాటలతో ఆ రైతుపై దాడికి దిగారు. రైతు ముఖంపై రెండు చోట్ల గాయాలయ్యాయి. మార్కెట్ యార్డ్ అసిస్టెంట్ సెక్రటరీ శాంతకుమార్‌కు రాత రూపంలో ఫిర్యాదు చేశాడు. రైతును నిలువునా దోపిడీ చేస్తున్నారంటూ మార్కెట్ యార్డ్ అధికారులపై రైతు నాగార్జున ధ్వజమెత్తాడు.

మద్దిలేటి స్వామిని దర్శించుకున్న జిల్లా న్యాయాధికారి



మహాలక్ష్మి అమ్మవారి శ్రీచక్రానికి కుంకుమార్చన చేస్తున్న ప్రధాన న్యాయాధికారి కుటుంబ సభ్యులు

బేతంచెర్ల, ఏప్రిల్ 6: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో వెలసిన మద్దిలేటి నరసింహ స్వామిని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు శనివారం దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. ప్రధాన న్యాయమూర్తి దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి సత్కరించారు.

మద్దిలేటి స్వామి క్షేత్ర ఆదాయం రూ.7.61 లక్షలు

మద్దిలేటి నరసింహస్వామి క్షేత్ర ఆదాయం రూ.7.61 లక్షలు సమకూరినట్లు ఉప కమిషనర్, ఆలయ ఈవో రామాంజనేయులు, చైర్మన్ సీతారామచంద్రుడు శనివారం తెలిపారు. భక్తులు వేకువ జాము నుంచే స్వామి అమ్మవార్లకు అభిషేకాలు, గండ దీపాలు, ప్రత్యేక పూజలు చేసి పుట్టు వెంట్రుకలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా స్వామి సేవా టికెట్లు, లడ్డూ ప్రసాదం, కేశఖండన, రూము బాడుగలు, లీజుల వసూళ్ల ద్వారా రూ.7,61,013 దేవస్థానానికి ఆదాయం లభించినట్లు వారు తెలిపారు.

చిరుధాన్యాల సాగుతో లాభాలు: జేడీ వరలక్ష్మి

కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 6: చిరుధాన్యాల సాగు వల్ల రైతులు లాభాల బాట పట్టే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ప్రధాన పంటలను నిరంతరం సాగు చేయడం వల్ల ఆ పంటలకు తెగుళ్లు, ఇతర కారణాల వల్ల దిగుబడి తగ్గి నష్టపోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయని, అందువల్లనే చిరుధాన్యాల సాగుతో ఖర్చు లు తగ్గుతుందన్నారు. చిరుధాన్యాల పంటలు తక్కువ సమయంలోనే చేతికి వస్తాయని, చీడపీడల ప్రభావం తక్కువగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం కూడా మద్దతు ధర ఇస్తుందని అన్నారు. రైతులు చిరుధాన్యాల పంటల సాగుపై దృష్టి పెట్టాలని కోరారు

ముస్లింల ద్రోహి జగన్ రెడ్డి

- ఎమ్మెల్సీ ఇక్బాల్



ఫరూక్‌ను కలిసిన ఎమ్మెల్సీ ఇక్బాల్

నంద్యాల (నూనెపల్లె), ఏప్రిల్ 6: రాష్ట్రంలోని ముస్లిం మైనార్టీల ద్రోహి జగన్‌మోహన్‌రెడ్డి అని వైసీపీ ఎమ్మెల్సీ ఇక్బాల్ ధ్వజమెత్తారు. పార్టీ సభ్యత్వానికి, ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసిన ఇక్బాల్ శనివారం నంద్యాలలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎన్ఎండీ ఫరూక్‌ను కలిశారు. దాదాపు గంటసేపు ఇరు నాయకులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అనంతరం ఇక్బాల్ మీడియాతో మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వ హయంలో ముస్లిం మైనార్టీలకు అమలు చేసిన సంక్షేమ పథకాలను వైసీపీ ప్రభుత్వం రద్దు చేసి తప్పుచేసిందన్నారు. మైనార్టీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం వల్ల తాను తీవ్ర అసంతృప్తికి గురైనట్లు తెలిపారు. పదవిలో ఉంటూ ముస్లింలకు న్యాయం చేయలేకపోయానని బాధపడ్డారు. వైసీపీలో తగిన గుర్తింపు, ప్రాధాన్యం లేకపోవడం వల్ల రాజీనామా చేశానన్నారు. వైసీపీ ప్రభుత్వం వ్యవస్థలన్నింటిని నిర్వీర్యం చేసిందని ఇక్బాల్ ఆరోపించారు. బైజూస్‌లో భారీ స్కామ్ జరిగిందని, లిక్కర్ మరో భారీ స్కామ్ అంటూ వైసీపీ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. సీఏఏపై దుష్ప్రచారం చేస్తూ లోపాయికారిగా బిల్లుకు వైసీపీ మద్దతు తెలిపిందన్న విషయాన్ని గుర్తు చేశారు. మైనార్టీ హక్కుల పరిరక్షణ, ప్రజా సంక్షేమం, ముస్లింల అభివృద్ధి, వక్ఫ్‌బోర్డు ఆస్తుల పరిరక్షణ చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని ఆయన పేర్కొన్నారు.

ఆటోలు ఢీ - వ్యవసాయ కూలీ మృతి

బనగానపల్లె, ఏప్రిల్6: మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీ దూదేకుల దస్తగిరి (55) అనే వ్యక్తి ఆటో ప్రమాదంలో మృతి చెందినట్లు నందివర్గం ఎస్ఐ తిరుపాలు శనివారం తెలిపారు. దస్తగిరితోపాటు మరి కొంత మంది వ్యవసాయ కూలీలు పలుకూరు నుంచి మిరపకాయలు తెంచేందుకు తిమ్మాపురం ఆటోలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొంది. దీంతో దస్తగిరి చేతికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఆటోలో ప్రయాణిస్తున్న భారతి, లక్ష్మీదేవిలకు గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడ్డ దస్తగిరి ఆటోలో నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుని భార్య దూదేకుల దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పలుకూరులో గనుల పనులు లేకపోవడంతో చాలా మంది వ్యవసాయ కూలీలుగా వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ప్రమాదం జరగడంతో దస్తగిరి మృతి చెందినట్లు మృతుని బంధువు పేర్కొంటున్నారు. గని పనులు ఉంటే వ్యవసాయ కూలీకి వెళ్లే వాడు కాదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ కో ఆప్షన్ సభ్యుడి అరెస్టు

నందికొట్కూరు ఏప్రిల్ 6 : ముస్లిం మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన నందికొట్కూరు మున్సిపాల్టీ కో ఆప్షన్ సభ్యుడు శ్రీనివాసరెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. రంజాన్ మాసంలో వచ్చే బడేరాత్ సందర్భంగా ప్రార్థన కోసం తాను సాయిబాబాపేటలోని షాహిమసీద్‌కు వెళ్తూ శ్రీనివాసరెడ్డి ఇంటి ముందుకు రాగానే ఆయన తన చెయ్యి పట్టుకుని, ముఖానికి వేసుకున్న బుర్కా తీసి చూసి, నోటికి వచ్చిన బూతులు తిట్టాడని షేక్ అలియాబేగం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో నందికొట్కూరు టౌన్‌లోని మిడ్తూరు రోడ్డులో ఉన్న డిగ్రీ కళాశాల వద్ద వైసీపీకి చెందిన శ్రీనివాసరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ ప్రకాష్ కుమార్ తెలిపారు.

బ్లాస్టింగ్‌తో కూలిన ఇల్లు



కూలిన మట్టిమిద్దె

పాణ్యం, ఏప్రిల్ 6 : కంకర కోసం చేపట్టిన బ్లాస్టింగ్ పనులతో మండలంలోని తమ్మరాజుపల్లెలో శనివారం తెల్లవారుజామున ఇంటి పైకప్పు కూలింది. ఇంట్లో నిద్రిస్తున్న ఇద్దరు బయటికి పరిగెత్తడంతో ప్రాణాలతో బయటపడ్డారు. సమీప గజ్జలకొండలో కంకర కోసం జరుపుతున్న బ్లాసింగ్ పనులతో ఇండ్లు కంపిస్తున్నాయని గ్రామస్థులు అంటున్నారు. అయినా అధికారులు తగిన చర్యలు తీసుకోలేదు. శనివారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రపోతున్న సుదర్శన్‌గౌడ్, మద్దమ్మ గజ్జల కొండ లోంచి భారీ పేలుడు శబ్దం రావడంతో మేల్కొన్నారు. ఇంతలో ఇంటిపై కప్పు నుంచి మట్టి రాలడం గమనించి బయటికి పరిగెత్తారు. ఆ తర్వాత మిద్దె కప్పు కూలిపోయింది. ఇంట్లోఉన్న సామాగ్రి పూర్తిగా దెబ్బతినింది. దాదాపు రూ 7. లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. ఈ సంఘటనపై వీఆర్వో రమేష్‌సింగ్‌కు, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశామన్నారు. బాధితులకు రూ. 10 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని టీడీపీ నాయకులు చల్లా సురేష్, రాజేంద్ర డిమాండ్ చేశారు.

ఆలయంలో చోరీ

- రూ.2 లక్షల విలువ గల వెండి వస్తువులు దొంగతనం

మద్దికెర, ఏప్రిల్ 6: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో బస్టాండు కూతవేటు దూరంలో ఉన్న పురాతన రామాలయంలో దొంగలు పడి రూ.2 లక్షలు విలువైన వెండి, బంగారు తాళిబొట్టు, డబ్బులు ఎత్తుకెళ్లారు. శనివారం ఉదయం గ్రామంలోని కొంత మంది పెద్దలు, పూజారి స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు వెళ్లగా తలుపులు పగులకొట్టి చోరీ చేసినట్లు గుర్తించారు. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దేవాలయంలోని హుండీని, సీతారామ లక్ష్మణ ఉత్సవ విగ్రహాల మూడు వెండి కిరీటాలను, సీతమ్మ వారి మెడలోని బంగారు మంగళసూత్రాన్ని ఎత్తుకెళ్లారు. హుండీలో రూ.2 లక్షల మేర డబ్బు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

ఆటోడ్రైవర్ నిజాయితీ



బంగారాన్ని బాధితురాలికి ఇస్తున్న సీఐ హనుమంతప్ప

ఆస్పరి, ఏప్రిల్ 6: తన ఆటోలో ప్రయాణిస్తూ, రూ.2 లక్షల విలువ చేసే బంగారం ఉన్న బ్యాగును వదిలేసి పోయిన మహిళకు డ్రైవర్ దాన్ని అందించాడు. మండలంలోని చిరుమాన్‌దొడ్డి గ్రామానికి చెందిన బ్రహ్మయ్య ఆటోలో శనివారం ఆదోని నుండి ఆస్పరి వెళ్లడానికి శోభ అనే మహిళ ఎక్కింది. ఆమె ఆస్పరిలో ఆటో దిగేటప్పుడు తన బ్యాగును మర్చిపోయింది. ఆటోడ్రైవర్ బ్యాగు తెరిచి చూడగా రూ.2.50 లక్షలు విలువ చేసే బంగారం కనిపించింది. అతను పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి బ్యాగును సీఐ హనుమంతప్పకు అప్పజెప్పాడు. విచారణ చేసిన సీఐ బంగారాన్ని పోగొట్టుకున్న మహిళను పిలిపించి అప్పగించాడు.

వైసీపీ పతనం ప్రారంభం: బైరెడ్డి శబరి



సోమయాజులపల్లెలో ప్రచారం చేస్తున్న బైరెడ్డి శబరి

ఓర్వకల్లు, ఏప్రిల్ 6: వైసీపీకి పతనం ప్రారంభమైందని, వైఎస్ జగన్‌ను ప్రజలు గద్దెదింపే రోజులు దగ్గర పడ్డాయని నంద్యాల పార్లమెంటు టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి అన్నారు. శనివారం మండలంలోని సోమయాజులపల్లె, లొద్దిపల్లె, భైరాపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో ఓర్వకల్లులో విమానాశ్రయం, ఉక్కు, ఆయుధాల, సోలార్ ప్లాంట్ పరిశ్రమలను స్థాపించి యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క పరిశ్రమ కూడా వచ్చిన దాఖలాలు లేవని ఆమె మండిపడ్డారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆరు పథకాలను అమలు చేస్తామన్నారు. పింఛన్ రూ.4వేలు ఇంటి దగ్గరకు వెళ్లి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో దేవేంద్ర, నారాయణరెడ్డి, పరమేశ్వరరెడ్డి, శ్రీనివాసరెడ్డి, నిరంజన్ రెడ్డి, పెద్ద గిడ్డయ్య, శివశంకర్, జనార్దన్ రెడ్డి, కర్రెన్న, హుశేనయ్య, వెంకటాద్రి, ఆదినారాయణ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, గొల్ల కృష్ణుడు, హనుమంతరావు, నాగమల్లేష్, రామమద్దిలేటి, కే.క్రిష్ణయ్య పాల్గొన్నారు.

9న రాంభొట్ల దేవస్థానంలో ఉగాది వేడుకలు



కరపత్రాలు విడుదల చేస్తున్న నగరూరు శ్రీనివాసరావు తదితరులు

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 6: పాతనగరంలోని రాంభొట్ల దేవస్థానంలో ఈనెల 9న ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు శ్రీరామ సేవా మండలి అధ్యక్షుడు, కార్పొరేటర్ నగరూరు శ్రీనివాసరావు, టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఉమ్మడి జిల్లా కార్య నిర్వాహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తెలిపారు. శనివారం దేవస్థానంలో ఉగాది వేడుకలకు సంబంధించిన కరపత్రాలను వివిధ హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రోధినామ సంవత్సర చైత్య శుద్ధ పాడ్యమి సందర్భంగా తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా 9న సాయంత్రం 5 గంటలకు ఉగాది పంచాంగ శ్రవణం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గడ్డం రామకృష్ణ, ఇస్కాన్ ధర్మ ప్రచారకుడు రామకృష్ణ సేవక్ దాస్‌జీ, ధర్మ ప్రచార మండలి సభ్యులు డాక్టర్ శ్రీమహాలక్ష్మి, బి.శ్రీరాములు, అరవీటి రమేశ్ శెట్టి, కృష్ణకాంత్, ఆలయ సిబ్బంది పెద్ది శ్రీనివాసులు, శర్మ, జట్టి యాదవ్, సంపతి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

జగన్‌ను ఇంటికి సాగనంపుదాం

సి.బెళగల్, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని ఓడించి జగన్‌ను ఇంటికి సాగనంపుదామని మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పోలకల్లు బీసీ కాలనీలో ఆయన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ టీడీపీ పాలనలో చేసిన అభివృద్ధే తప్ప వైసీపీ పాలనలో ఎక్కడ కూడా అభివృద్ధి జరగలేదన్నారు. టీడీపీ నాయకులు ఎర్రమల, రాజు, సోమేశ్వరి, కళ్యాణి పాల్గొన్నారు.

వైసీపీకి బుద్ధి చెప్పాలి

గూడూరు, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పాలని నగర పంచాయతీ మాజీ వైస్ చైర్మన్ కురుకుంద రామాంజనేయులు, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గజేంద్ర గోపాల్‌నాయుడు అన్నారు. శనివారం గూడూరు 7వ వార్డులో టీడీపీ నాయకులు రామాంజనేయులు, గజేంద్ర గోపాల్ నాయు డు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు ఇంటింటికి వెళ్ళి బాబు షూరిటీ - భవిష్యత్తు గ్యారెంటీ కింద సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కళ్యాణ్ రఘు, పౌలు, తెలుగు శ్రీను, కౌన్సిలర్ బుడ్డంగలి, మండల తెలుగు యువత అధ్యక్షుడు సుమన్, ఎల్లయ్య, గిడ్డయ్య, చిలక శ్రీను, విష్ణు సేన అభిమానులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు పని కల్పించాలి

కల్లూరు, ఏప్రిల్ 6: మండలంలోని గ్రామాల్లో ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపీ.నారాయణ డ్వామా పీడీకి వినతిపత్రం అందజేశారు. శనివారం డ్వామా కార్యాలయంలో పీడీకి ఉపాధి కూలీల సమస్యలు వివరించారు. పనులు చూపించకపోవడంతో కూలీలు ఇళ్లవద్దే ఉంటున్నారని, ఫారంపండ్ పనులు మాత్రమే చేయాలని చెప్పడంతో కూలీలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మధు, బాలపీరా పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థుల ప్రతిభ

కర్నూలు(స్పోర్ట్స్), ఏప్రిల్ 6: ఇటీవల ఏపీ స్టేట్ అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కరాటే, కుమీట్ పోటీల్లో నారాయణ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని ప్రిన్సి పాల్ మహమ్మద్ అల్తాఫ్ శనివారం తెలిపారు. ఏజీఎం రమేష్ కుమార్ ఆదేశాల మేరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాలలో శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 17వ జిల్లా స్థాయి కరాటే పోటీల్లో సుహాస్ ప్రథమ స్థానంలో నిలిచి బంగారు పతకం, కుమిట్ (కుస్తీ), కరాటేలో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధించారన్నారు. వీరు ఈ నెల 29న ముంబైలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తాగునీటి కష్టాలను పరిష్కరిస్తా: టీజీ భరత్

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 6: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి కష్టాలను పరిష్కరిస్తానని కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ హామీనిచ్చారు. శనివారం నగరంలోని 42వ వార్డు పరిధి తిలక్‌నగర్‌లో వైసీపీ నాయకులు మహేష్, విజయ్, శ్రీనివాసులు తదితరులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమానికి టీజీ భరత్‌తోపాటు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలులోని అన్ని వార్డుల్లో టీడీపీ పూర్తి స్థాయిలో బలోపేతమైందన్నారు. జగన్ ప్రభుత్వంలో ఒక్క రూపాయి పని చేసి 99 రూపాయలు పబ్లిసిటీ చేసుకుంటున్నారని ఆరోపించారు. సరైన ప్రభుత్వం, సరైన నాయకులు ఉంటేనే ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని భరత్ హామీనిచ్చారు. తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వలీ, తిమ్మారెడ్డి, హరి, మధు యాదవ్, ఫయాజ్, శ్రీను, తెలుగు నరసింహులు, జనసేన ఇంచార్జీ అర్షద్, జనసేన రాయలసీమ ఎన్నికల కన్వీనర్ పవన్, బీజేపీ నాయకులు సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



ఖర్జూరం తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేస్తున్న టీజీ భరత్



మాట్లాడుతున్న టీజీ భరత్

రంజాన్ మాసం పవిత్రమైంది: టీజీ భరత్

కర్నూలు(అర్బన్): ముస్లింలకు రంజాన్ మాసం ఎంతో పవిత్రమైందని కర్నూలు తెలుగుదేశం పార్టీ అభ్యర్థి టీజీ భరత్ అన్నారు. శనివారం పెద్ద మార్కెట్ వద్ద ఉన్న జామీయా మసీదులో నిర్వహించిన ఇఫార్ విందులో టీజీ భరత్ పాల్గొన్నారు. ముస్లిం పెద్దలకు పండ్లు తినిపించి రోజా ఉపవాస దీక్షను ఆయన విరమింపజేశారు. అనంతరం వారితో కలిసి టీజీ భరత్ ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్ బాషా, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ మన్సూర్ అలీఖాన్, మైనార్టీ కమిటీ నగర అధ్యక్షుడు హమీద్, జనసేన అసెంబ్లీ ఇన్‌చార్జి హర్షద్ పాల్గొన్నారు.

వైసీపీ ఎమ్మెల్యే బంధువు టీజీ భరత్‌కు మద్దతు: వైసీపీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ సమీప బంధువు ఉమర్ అలీఖాన్ కర్నూలు టీడీపీ అభ్యర్థి టీజీ భరత్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. శనివారం మౌర్యఇన్‌లోని టీజీ భరత్ కార్యాలయంలో ఉమర్ అలీఖాన్ తన బృందంతో కలిసి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఉమర్ అలీఖాన్ మాట్లాడుతూ టీజీ భరత్ గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. అనంతరం టీజీ భరత్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రంలోని యువతకు 20 లక్షల ఉద్యోగాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకుడు రాంబో పాల్గొన్నారు.

టీడీపీతోనే సుపరిపాలన : గౌరు చరిత

కల్లూరు, ఏప్రిల్ 6: టీడీపీ కూటమి గెలిస్తేనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని పాణ్యం టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. శనివారం కల్లూరు అర్బన్ 19వ వార్డు అపూర్వ అపార్ట్‌మెంట్, ఎంఎస్-9 అపార్ట్‌మెంట్‌లో ఆమె శంఖారావం, టీడీపీ సూపర్‌సిక్స్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని మ్యానిఫెస్టో పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గౌరుచరిత మాట్లాడుతూ చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తుందన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్‌యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి, పెరుగు దుర్గాప్రసాద్‌రెడ్డి, కట్టా వెంకటరెడ్డి, అరుణ్‌కుమార్‌రెడ్డి, మాంద్ర నరేంద్రనాథ్‌రెడ్డి, వంగాల జనార్దన్‌రెడ్డి, సీమ ప్రసాద్‌రెడ్డి, నాయకులు విజయ్‌యాదవ్, టీచర్ జగదీస్, నాగముని, శ్రీరాములు, అయ్యస్వామి పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనం

ఓర్వకల్లు: వైసీపీ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని పాణ్యం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గౌరు చరిత అన్నారు. శనివారం మండలంలోని మీదివేముల గ్రామంలో ఆమె నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్‌తో కలిసి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ శంఖరావం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ కరపత్రాలు పంపిణీ చేస్తూ వైసీపీ వైఫల్యాలను ప్రజలకు వివరించారు. టీడీపీ అధికారంలోకి వస్తే.. రాష్ట్రంలో ప్రజా సమస్యలన్నీ పరిష్కారమవుతాయన్నారు. అలాగే వైసీ పీ అరాచకాలు ఎక్కువయ్యాయని ఈ ప్రభుత్వానికి చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అన్ని కులాల వారికి మేలు జరిగిందన్నారు. సంక్రాంతి, క్రిస్మస్, రంజాన్ తోఫా వంటి పథకాలతో వారి కుటుంబాల్లో ఆనందంగా పండుగ జరుపుకునే వారన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే ఆరు సంక్షేమ పథకాలను ప్రవేశ పెడుతామని, అలాగే పింఛన్ రూ.4వేలకు పెంచి ఇంటి వద్దకే పంపిణీ చేస్తా మన్నారు. మీదివేముల గ్రామంలో జరిగిన అవినీతి, అక్రమాలపై అధికా రంలోకి వచ్చిన వెంటనే విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ గోవింద రెడ్డి, నాయకులు మోహన్ రెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, గంగాధర్ రెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి, గోకారి, రామాంజనేయులు, బుగ్గ రాముడు, బ్రాహ్మణపల్లి నాగిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, మహబూబ్ బాషా, తిరుపాలు, ప్రకాశం, పుల్లారెడ్డి, నాగముని, రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.



కరపత్రాలను అందజేస్తున్న గౌరు చరిత

విమానాశ్రయంలో నారా భువనేశ్వరికి ఘనంగా వీడ్కోలు



నారా భువనేశ్వరికి వీడ్కోలు పలుకుతున్న టీడీపీ నాయకులు

ఓర్వకల్లు, ఏప్రిల్ 6: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును తట్టుకోలేక మృతి చెందిన కుటుంబాలకు పరామర్శించేందుకు గత రెండు రోజులుగా నంద్యాల జిల్లాలో డోన్, పాణ్యం, ఆత్మకూరు, నంద్యాలలో పర్యటించి నిజం గెలవాలని కార్యక్రమాన్ని నారా భువనేశ్వరి దిగ్విజయంగా ముగించుకుని శనివారం ఓర్వకల్లు విమానాశ్రయం చేరుకున్నారు. ఆమెకు పాణ్యం టీడీపీ అభ్యర్థి గౌరు చరిత, నంద్యాల టీడీపీ అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, ముస్లిం మైనార్టీ నాయకులు మహబూబ్‌బాషా, మాజీ సర్పంచ్ మల్లెల జ్యోతి, మహిళలు, కార్యకర్తలు ఆమెకు ఘనంగా వీడ్కోలు పలికారు అనంతరం ప్రత్యేక విమానంలో ఆమె హైదరాబాదుకు బయలుదేరి వెళ్లారు.

కర్ణాటక మద్యం పట్టివేత



సెబ్ పోలీసులు పట్టుకున్న కర్ణాటక మద్యం

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 6: కోడుమూరు ఎస్ఈబీ స్టేషన్ పోలీసులు కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నారు. సెబ్ సీఐ రామాంజ నేయులు తెలిపిన వివరాలివి.. గుండ్రేవుల గ్రామంలో బోయ భాస్కర్ కల్లందొడ్డిలో దాచి ఉంచిన 30 బాక్సుల మద్యాన్ని గుర్తించామని, అక్రమ మద్యాన్ని పోలకల్‌కు చెందిన పల్దొడ్డి రామకృష్ణకు సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంచినట్లు విచారణలో తేలిందన్నారు. పట్టుకున్న మద్యం విలువ రూ. 1,81,500 లక్షలు ఉంటుందన్నారు. నిందితుడు భాస్కర్‌ను అరెస్టు చేసి నట్లు తెలిపారు. రామకృష్ణను కూడా త్వరలో అరెస్టు చేస్తామని అన్నారు. దాడిలో ఎస్ఐ అలీబేగ్ సిబ్బంది హనుమంతు, వీరుపాక్షిరెడ్డి, వెంకటేష్ నాయక్, శంకర్‌నాయక్, అన్సార్‌బాషా పాల్గొన్నారు.

అమరవీరులను స్మరించుకోవాలి

ఓర్వకల్లు, ఏప్రిల్ 6: అమరవీరులను స్మరించుకోవడం అందరి బాధ్యత అని హైదరా బాదు సీఆర్పీఎఫ్ జీసీ కమాండర్ మల్లె శివనాగరాజు అన్నారు. ఓర్వకల్లు గ్రామానికి చెందిన సీఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్ చంద్ర మౌళీశ్వరరెడ్డి సంస్మరణ సభ శనివారం జరిగింది. ముఖ్య అతిథులుగా కమాండర్ శివనాగరాజు, తహసీల్దార్లు మునివేలు, నటరాజ్, ఎంపీడీవో మల్లీశ్వరి, హెడ్ మాస్టర్ రామచంద్రరెడ్డి హాజరై చంద్రమౌళీ శ్వరరెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓర్వకల్లు గ్రామానికి చెందిన మద్దికుంట చంద్రమౌళీశ్వరరెడ్డి 2010లో దంతెవాడ జిల్లా చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో మావోయిస్టుల దాడుల్లో అమరవీరులయ్యారని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగేశ్వరమ్మ, నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, శంకర్ రెడ్డి, మీనిగె శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటు ల్యాబ్‌లకు పంపితే చర్యలు

కర్నూలు(హాస్పిటల్), ఏప్రిల్ 6: కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఎవరైనా నిర్ధారణ పరీక్షలను ప్రైవేటు ల్యాబ్‌లకు పంపితే చర్యలు తీసుకుం టామని సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి హెచ్చరించారు. శనివారం గైనిక్ విభాగంలో ఆయన వైద్యులతో సమీక్ష నిర్వహించారు. ఇక గర్భిణుల హైరిస్క్ కేసులను ఆరోగ్యశ్రీలో చేయాలని, అరుదైన శస్త్ర చికిత్సలు చేయడా నికి వైద్యులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో హేమనళిని, గైనిక్ విభాగపు హెచ్ వోడీ శ్రీలక్ష్మి, గైనిక్ ప్రొఫెసర్ సావిత్రి సుధాకర్, వైద్యులు పాల్గొన్నారు.

రోగులకు ప్రేమతో సేవలందించాలి: పేద రోగులకు ప్రేమతో సేవలందించాలని న్యూ హౌస్ సర్జన్స్‌ను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ వి.వెంకటరంగారెడ్డి అన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ న్యూలెక్చర్ గ్యాలరీలో శనివారం సాయంత్రం న్యూహౌస్ సర్జన్స్‌కు ఓరియం టేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. నూతన హౌస్ సర్జన్లు ప్రతి ఒక్కరూ ఐడీ కార్డు, డ్రెస్ కోడ్, బయోమెట్రిక్, అటెండెన్స రిజిస్టర్ ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర వ్యవస్థాపకుడు డాక్టర్ బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పేదలకు మానవతా దృష్టితో సేవలందించాలన్నారు. ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి, సీఎస్ఆర్ఎంవో వెంకటేశ్వర రావు, ఆర్ఎంవో వెంకటరమణ, శివబాల, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

వైసీపీకి చరమగీతం పాడుదాం



బి. తాండ్రపాడులో ప్రచారం చేస్తున్న బొగ్గుల దస్తగిరి

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పాడుదామని కోడుమూరు టీడీపీ అభ్యర్థి బొగ్గుల దస్తగిరి ప్రజలకు పిలుపు నిచ్చారు. కర్నూలు రూరల్ మండలం బి.తాండ్రపాడు గ్రామంలో శనివారం మూడవ రోజు ఎస్సీ కాలనీలో బొగ్గుల దస్తగిరి స్థానిక సర్పంచు ఆకెపోగు జయన్నతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్ళి చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. మాజీ సర్పంచు శ్రీనివాసులు, ఎంపీటీసీ మద్దిలేటి, మాజీ ఎంపీటీసీ మాధన్న, ఉపసర్పంచు చాంద్‌బాషా, తెలుగు యువత అధ్యక్షుడు పేరపోగు రాజు, రామకృష్ణ, కిషోర్, రసూల్, గొల్ల వెంకటేష్, జనసేన నాయకుడు రాంబాబు, సురేంద్ర పాల్గొన్నారు.

'రీ-సైక్లింగ్‌తో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు'



రాయపాటి శ్రీనివాస్‌తో ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

కర్నూలు (కల్చరల్), ఏప్రిల్ 6: ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీ-సైక్లింగ్‌తో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని లయన్స్ క్లబ్ జిల్లా అడిషనల్ క్యాబినేట్ సెక్రటరీ రాయపాటి శ్రీనివాస్ అన్నారు. శనివారం జాతీయ ఆరోగ్య దినోత్స వాన్ని పురస్కరించుకొని నగరంలోని వీఆర్ కాలనీలోగల నైస్ కంప్యూటర్స్ శిక్షణ కేంద్రంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్, సైన్ యూత్ ఫర్ కల్చర్ అండ్ ఎడ్యుకేషన్ స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో 'ఎలక్ట్రానిక్స్ వ్యర్థాల రీ-సైక్లింగ్ - పర్యావరణ పరిరక్షణ' అనే అంశంపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. లయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు అధ్యక్షురాలు రాయపాటి నాగలక్ష్మి, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనులు నాణ్యతగా చేపట్టండి

కోడుమూరు(రూరల్), ఏప్రిల్ 6: ఉపాధి పనులను నాణ్యతగా చేపట్టాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని ఎర్రదొడ్డి గ్రామంలో ఫిష్‌పాండ్ తవ్వకాన్ని పీడీ శనివారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన కూలీల హాజరు తనిఖీ చేశారు. ఉష్ణోగ్రతలు పెరిగినందున ఉదయం పూట త్వరగా పనులకు చేరుకోవాలని, తాగు నీరు వెంట తప్పని సరిగా ఉంచుకోవాలని సూచించారు. ఏపీవో మోదీన్ బాషా, ఈసీ వెంకటేశ్వర్లు, టీఏ, ఎఫ్ఏలు పురుషోత్తం, జనార్దన్ ఉన్నారు.

టీడీపీలో చేరిన మునగాల వైసీపీ నాయకులు

కర్నూలు(రూరల్), ఏప్రిల్ 6: గూడూరు మండలం మునగాల, యాపదిన్నె గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు మాజీ సర్పంచు ఓబులేసు, మాజీ వార్డు సభ్యులు సుధాకర్, అంజి, రామ్, ప్రతాప్‌తోపాటు మరో వంద మంది కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. శనివారం కర్నూలులో టీడీపీ సీనియర్ నాయకుడు ఎదురూరు విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విధ్వంస పాలనకు చరమగీతం పాడి చంద్రబాబును సీఎంగా చేసుకోవాలన్నారు. టీడీపీలో చేరిన వారిలో సుంకన్న, కుమార్, వెంకట్, రాముడు, లక్ష్మన్న, నాగప్ప, మార్క్, ఓబులేసు, కృపన్న, సుధాకర్, గోపాల్, నాగరాజు, రాముడు, రంగయ్య, ఎల్లప్ప, పెద్దనాగరాజు, నడిపి నాగరాజు, ప్రకాష్, అనిల్, బంగి మద్దిలేటి, రాజు, ఏసేపు, రాజ్‌కుమార్, మునిరాజ్, రవి ఉన్నారు. కార్యక్రమంలో గూడూరు మండల నాయకులు పౌల్, సృజన్, కౌన్సిలర్ బుడ్డంగలి పాల్గొన్నారు.

● సి.బెళగల్ మండలం క్రిష్ణదొడ్డి గ్రామానికి చెందిన నాగేంద్ర ఆధ్వర్యంలో దాదాపు 40మంది కుటుంబాలకు పైగా వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. వారికి టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో చేరిన వారిలో గొల్ల తిరుమలేసు, బోయ వీరన్న, రామకృష్ణ, రమేష్, వెంకటేష్, రాజు, రంగన్న, లక్ష్మన్న, రామకృష్ణ, భద్ర, పురుషోత్తం, వెంకటేష్, పులికొండ, లక్ష్మన్న, బాలకృష్ణ పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో విష్ణువర్ధన్‌రెడ్డి

పశుగ్రాసం దగ్ధం

ఓర్వకల్లు, ఏప్రిల్ 6: మండలంలోని నన్నూరు గ్రామంలో శనివారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధమయ్యాయి. దీంతో రూ.4లక్షలు నష్టం వాటిల్లింది. నన్నూరు గ్రామానికి చెందిన నయావత్ రైతుకు చెందిన మూడు గడ్డివాములు, ఉస్మాన్‌కు చెందిన గడ్డివాములు దగ్ధమైంది. పూర్తిగా పశుగ్రాసం కాలిపోయింది. పశుగ్రాసం అగ్నికి ఆహుతి దగ్ధం కావడంతో రైతులు బోరున విలపించారు. పంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. పశుగ్రాసం అంతా కాలిపోయి బూడిదైంది.

● **రైతులకు ఆర్థిక సాయం అందించాలి:** నన్నూరు గ్రామంలో కాలిపోయిన గడ్డివాము రైతులకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి కోరారు. శనివారం సాయంత్రం కాలిపోయిన పశుగ్రాసాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట నాయకులు విశ్వేశ్వరరెడ్డి, గోవిందరెడ్డి, విజయుడు ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ జారీపై శ్రద్ధ తీసుకోవాలి

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ జారీపై శ్రద్ధ తీసుకుంటున్నట్లు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎ.భార్గవతేజ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌పై భారత ఎన్నికల సంఘం తాజాగా మార్గ దర్శకాలు జారీ చేసిందన్నారు. పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి ఫారం-12ను నగర పాలక సంస్థ కార్యాలయంలోని సెక్రటరీ చాంబర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో అందజేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

12న మాదిగల సింహ గర్జన

కర్నూలు(న్యూసిటీ), ఏప్రిల్ 6: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఈనెల 12న కర్నూలులో జరగబోయే మాదిగల సింహ గర్జనను జయప్రదం చేయాలని జై భీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు చిక్కం జానయ్య మాదిగ పిలుపునిచ్చారు. శనివారం నగరంలో సింహ గర్జన పోస్టర్‌ను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్టీబీసీ కళాశాల సమీపంలోని బీఏఎస్ కల్యాణ మండపంలో జరిగే సభకు రాష్ట్ర నలుమూలల నుంచి మాదిగలు తరలివస్తున్నారని అన్నారు. ఎస్సీ,ఎస్టీ జిల్లా విజిలెన్సు మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు కిరణ్‌కుమార్, జైభీమ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రశాంత్, ఆరేకంటి సత్యన్న పాల్గొన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారం

గూడూరు, ఏప్రిల్ 6: మండలంలోని కె నాగలాపురం సబ్ స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 5ఎంవీఏ పీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్‌తో లో ఓల్టేజీ సమస్య పరిష్కారమైనట్లు ఏఈ శ్రీనివాస నాయక్ తెలిపారు. శనివారం కె.నాగలాపురం గ్రామంలో సబ్ స్టేషన్ నూతనంగా 5ఎంవీఏ పీటీఆర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశామన్నారు. ఐ విద్యుత్ శాఖ ఈఈ వెంకటేశ్వర్లు, ఏడీ జేసన్, ఏఈ శ్రీనివాస నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

సి.బెళగల్, ఏప్రిల్ 6: మండలంలోని కొత్తకోట, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతోపాటు కోడుమూరు సీఐ మన్సురుద్దీన్, పోలీసులు పర్యటించారు. ఈసందర్భంగా కోడుమూరు సీఐ మాట్లాడుతూ ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్ర మంలో ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడండి



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

కర్నూలు(కల్చరల్), ఏప్రిల్ 6: మతసామరస్యాన్ని కాపాడాలని ఆవాజ్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు గఫూర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఎంఎస్ ఫంక్షన్ హాలులో అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ముస్లిం పెద్దలతో కలిసి ప్రార్థనలు చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, నాయకులు అబ్దుల్ జబ్బర్, మౌలానా, ఇక్బాల్ హుశేన్, సుభాన్, షరీఫ్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), ఏప్రిల్ 6: ఎన్నికల విధుల నుంచి వికలాంగులు, గర్భిణులు, చంటిబిడ్డలు ఉన్న మహిళా ఉద్యోగిణులు, ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా గౌరవా ధ్యక్షుడు రామశేషయ్య కోరారు. శనివారం డీఆర్వో మధుసూదన్‌కు వినతి పత్రం అందజేశారు.

ఆరు వారాలుగా కూలి డబ్బులు పెండింగ్

కర్నూలు(అగ్రికల్చర్), ఏప్రిల్ 6: ఆరు వారాలుగా ఉపాధి కూలీలకు వేతనాలు ఇవ్వలేదని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి వ్యవసాయ కూలీలకు వెంటనే కూలీ డబ్బులు చెల్లించాలని శనివారం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమర్నాథ్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, దీంతో గ్రామాల్లో ఎటువంటి పనులు లేక రైతులు, కూలీలు సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని, అక్కడ పనుల్లేక తిరిగి గ్రామాలకు చేరుకుంటున్నారన్నారు.

అనుమతి లేకుండా విద్యుత్ వినియోగిస్తే చర్యలు

సి.బెళగల్, ఏప్రిల్ 6: అనుమతి లేకుండా విద్యుత్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని ఏఈ సుకుమార్ హెచ్చరించారు. మండలంలోని సి.బెళగల్, బురాన్‌దొడ్డి గ్రామాల్లోని ప్రజలు, రైతులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిండిమిషన్, కుటీర పరిశ్రమల యజమానులు విద్యుత్ బకాయిలను చెల్లించాలన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉండేలా చూడాలి

సి.బెళగల్, ఏప్రిల్ 6: గ్రామాల్లో పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీడీవో శకుంతల అన్నారు. మండలంలోని ఈర్లదిన్నె, శింగ వరం, ముడుమాల, కొండాపురం గ్రామాల వీధుల్లో మురుగు నీరు నిల్వ ఉండటంతో అనారోగ్యాలకు గురవుతున్నామని గ్రామస్థులు శనివారం ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లారు. పరిసరాల పరిశుభ్రతపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పని ఆమె పంచాయతీ కార్యదర్శులకు హెచ్చరించారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు ● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

టీడీపీ విజయానికి కృషి చేయాలి

ఆలూరు అభ్యర్థి వీరభద్రగౌడ్



మాట్లాడుతున్న వీరభద్రగౌడ్

దేవనకొండ , ఏప్రిల్ 6: టీడీపీ విజయానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని ఆలూర అభ్యర్థి వీరభద్రగౌడ్ అన్నారు. శనివారం దేవనకొండ టీడీపీ కార్యాలయం, లక్ష్మీ రంగా కళ్యాణ మండపంలో మండల కార్యకర్తలతో సమావేశమయ్యారు. వీరభద్రగౌడ్ మాట్లాడుతూ పేదలకు ఇచ్చే సామజిక పింఛన్ల పెంపులో సీఎం జగన్ ఒకేసారి రూ.3వేలు ఇవ్వకుండా మోసం చేశాడని ధ్వజమెత్తారు. టీడీపీ అధినేత చంద్రబాబు అధికారంలోకి రాగానే ఏప్రిల్ నుంచే నెలకు రూ.4వేలు మాదిరిగా ఇస్తానని, అవ్వాతాతలకు, వికలాంగులకు, వితంతువులకు భరోసా ఇచ్చారన్నారు. సమావేశంలో మండల కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్, బడిగింజల రంగన్న, ఉచ్చీరప్ప, రామారావునాయుడు, కప్పట్రాళ్ల మల్లికార్జున, భాస్కర్, బీజేపీ నాయకులు రవికుమార్, వీరయ్య, జనసేన నాయకురాలు సరోజ ,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీవీ జన్మదిన వేడుకలు



గోనెగండ్లలో కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటున్నటీడీపీ కార్యకర్తలు

గోనెగండ్ల, ఏప్రిల్ 6: గోనెగండ్లలోని టీడీపీ కార్యాలయంలో శనివారం రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. అభిమానులు కేట్ కట్ చేశారు. అభిమానులు బీవీ జన్మదిన సందర్భంగా మిఠాయిలు పంచి శుభాకంక్షలు తెలుపుకున్నారు.

ఎన్నికల్లో అల్లర్లు వద్దు

మంత్రాలయం, ఏప్రిల్ 6: మంత్రాలయం మండలంలోని ఖగ్గల్లు, నారాయణపురం, కాచాపురం, తుంగభద్ర గ్రామాల్లో అల్లర్లకు పాల్పడవద్దని మంత్రాలయం సీఐ ఎరిషావలి, మాధవరం ఎస్ఐ క్రిష్ణమూర్తి అన్నారు. శనివారం కేంద్ర బలగాలు, మాధవరం పోలీసులతో కవాతు నిర్వహించారు. వారు మాట్లాడుతూ అల్లర్లకు పాల్పడే వారిపై ముందస్తు దృష్టి ఉంచుతామని, ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అవగాహన కల్పించేందుకు కవాత్తు నిర్వహించడం జరిగిందన్నారు.

కమ్యూనిస్టులను ఆదరించండి

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 6: పేదల కోసం నిరంతరం పోరాటం చేసే కమ్యూనిస్టు పార్టీల అభ్యర్థులను ఆదరించి త్వరలో జరిగే ఎన్నికల్లో ఆదరించాలని, ఇండియా కూటమి బలపరుస్తున్న పత్తికొండ అసెంబ్లీ సీపీఐ అభ్యర్థి రామచంద్రయ్య కోరారు. శనివారం పట్టణంలోని జూనియర్ కళాశాల, గుత్తి రోడ్డులో మార్నింగ్ వాక్‌కు వెళ్లిన పట్టణ వాసులతో రామచంద్రయ్య కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రాజాసాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే బీజేపీ ధ్యేయం



బీజేపీ ఆవిర్భావ దినోత్సవంలో పాల్గొన్న కార్యకర్తలు

ఆదోని టౌన్, ఏప్రిల్ 6: బడుగు, బాలహీన వర్గాల ప్రజలకు మౌలిక వసతుల కల్పన కోసమే భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించిందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, ఆదోని అసెంబ్లీ కన్వీనర్ నాగరాజు గౌడ్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో బీజేపీ 44వ ఆవిర్భావ దినోత్సవం పట్టణ అధ్యక్షుడు జిందే సాయి అధ్యక్షతన జరిగింది. సార్వత్రిక ఎన్నికలలో కూటమి అభ్యర్థిగా బీజేపీ పార్టీకు చెందిన డాక్టర్ పార్థసారథికు పోటీ చేయడానికి అవకాశం లభించిందని, టీడీపీ, జనసేన పార్టీల సహకారంతో విజయం సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మలేకర్ శ్రీనివాసులు, మండల, పట్టణ ప్రధాన కార్యదర్శి దేవేంద్ర, కోసిగయ్య, ముఖేష్, ఓబీసీ నాయకులు మునిస్వామి, ఉరుకుందు గౌడ్, అంజయ్య కుమార్, శ్రీకాంత్, మణికంఠ, నాగార్జున, లక్ష్మీకాంత్, మల్లికార్జున పాల్గొన్నారు.

వడగాల్పులపై జాగ్రత్త వహించండి

మద్దికెర, ఏప్రిల్ 6: ఎండలు మండిపోతున్నాయని, వడగాల్పులు వీస్తున్నందు వల్ల అత్యవసరమైతేనే బయటకు రావాలని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్ బాషా అన్నారు. శనివారం వడగాల్పులపై అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బైట తిరగవద్దని అన్నారు. తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్లే వారు గొడుగు, టోపి, తలపాగ, నూలు వస్త్రాలు ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది గాయత్రి తదితరులు పాల్గొన్నారు.





పాత ఆంజనేయ స్వామి వీధిలో టీడీపీ ఆరు గ్యారెంటీలపై మహిళలకు వివరిస్తున్న జయనాగేశ్వరరెడ్డి

పింఛన్లపై వైసీపీ నీచ రాజకీయం

● మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 6: పింఛన్లు పంపిణీ చేయలేక వైసీపీ నాయకులు టీడీపీపై విషప్రచారం చేస్తూ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ అభ్యర్థి జయనాగేశ్వరరెడ్డి ఆరోపించారు. శనివారం పట్టణంలోని 18వ వార్డులో ఇంటింటికి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ పింఛన్‌దారుల ఇంటింటికి వెళ్లి డబ్బు ఇవ్వాలని ఆదేశించినా ప్రభుత్వం కావాలనే ఆలస్యం చేసిందన్నారు. అవ్వాతాతలు పింఛన్లకు వచ్చి మృతి చెందారని శవరాజకీయాలు చేస్తూ లబ్ధిపొందాలని చూడడం దారుణమన్నారు. అంతేగాక ఇంట్లో ఉన్న మృద్ధులందరికీ పింఛన్లు ఇవ్వలేక ఏదో కారణం చెప్పి అనేకమంది అవ్వాతాతలకు పింఛన్‌లో కోత పెట్టిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదేనన్నారు. కేవలం ఎన్నికల్లో లబ్ధిపొందేందుకే టీడీపీపైనా చంద్రబాబుపై వైసీపీ నాయకులు బురదచల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. అయితే ఎవరు నమ్మే స్థితిలో లేరన్నారు. అభివృద్ధి, సంక్షేమం ఒక్క టీడీపీ, చంద్రబాబుతోనే సాధ్యమని, జరిగే ఎన్నికల్లో తనను గెలిపించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ సమస్యలన్నీ పరిష్కరిస్తానన్నారు. అనంతరం మండలపరిధిలోని సోగనూరు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వార్డు మాజీ కౌన్సిలర్ జ్యోతి, నాయకులు ముల్లా కలీములా, వాల్మీకి రామకృష్ణ, టీడీపీ పట్టణ వైస్‌ప్రెసిడెంట్ రంగాస్వామి గౌడ్, మజీ సర్పంచ్ కాశీంవలీ, కొండన్న గౌడ్, కౌన్సిలర్లు రామదాసు గౌడ్, దయాసాగర్, జయన్న, బచ్చాల రంగన్న, కటారి రాజేంద్ర, వెంకటేశులు మండల నాయకులు సోమేశ్వరరెడ్డి, మల్లికార్జున, రాఘవేంద్ర, జగదీష్, రంగన్న, ఖాజా, కేటీ వెంకటేశులు పాల్గొన్నారు.

'చంద్రబాబును ముఖ్యమంత్రి చేద్దాం'

మంత్రాలయం, ఏప్రిల్ 6: రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలను సర్వనాశనం చేసిందని, సమష్టి కృషితో ముఖ్యమంత్రిగా చంద్రబాబును చేసుకుందామని బీజేపీ రాష్ట్ర నాయకులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది పురుషోత్తంరెడ్డిని మంత్రాలయం టీడీపీ అసెంబ్లీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి అన్నారు. శనివారం కల్లుదేవకుంట సమీపంలో బీపీఆర్ ఫామ్ హౌస్‌లో బీజేపీ కార్యాలయంలో టీడీపీ అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి బీజేపీ నాయకులు పురుషోత్తంరెడ్డిని కలిసారు. మంత్రాలయం నియోజకవర్గంలో బీజేపీ, టీడీపీ, జనసేన సమష్టిగా ప్రచారం నిర్వహించి మంత్రాలయం గడ్డపై టీడీపీ జెండా ఎగురవేద్దామని అన్నారు. ఆయా మండలాల బీజేపీ అధ్యక్షులు, నాయకుల, కార్యకర్తలు రాఘవేంద్రరెడ్డి గెలపుకోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ, పెద్దకడుబూరు మండల బీజేపీ నాయకురాలు మేరీ, సత్యనారాయణ రెడ్డి నాయకులు పాల్గొన్నారు.



బీజేపీ రాష్ట్ర నాయకులను కలిసిన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి

బీసీలపై జగన్ కపట ప్రేమ

పెద్దకడుబూరు: సీఎం జగన్‌కు బీసీలపై కపటప్రేమ చూపుతున్నారని మంత్రాలయం టీడీపీ అభ్యర్థి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చిన్నతుంబళం గ్రామంలో జయహోబీసీ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ కులానికి ఓ కార్పొరేషన్ పేరుతో 56కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసినప్పటికీ వారికి కూర్చోవటానికి కుర్చీలు కూడా లేని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే న్యాయం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్ని ఫెడరేషన్లు పెట్టినా ఏ ఒక్క బీసీ కూడా బాగుపడిన దాఖలాలు లేవన్నారు. బీసీలంటే టీడీపీ.. టీడీపీ అంటేనే బీసీలన్నారు. బీసీలపైన చంద్రబాబుకు ప్రేమ ఉంది కాబట్టే వాల్మీకి అయిన నాకు సీటు కేటాయించారన్నారు. ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి టీడీపీ అధినేత చంద్రబాబు వాల్మీకులకు సీటు కేటాయించటంతో భయం పుట్టి మిగతా కులాలను పిలిచి తనకే ఓటు వేయాలని బాసలు చేయించుకుంటున్నారన్నారు. ఎమ్మెల్యే తండ్రికి, ఎమ్మెల్యే బాలనాగిరెడ్డికి రాజకీయ భిక్షపెట్టింది టీడీపీయో నన్నారు. చంద్రబాబును విమర్శించే స్థాయి ఎమ్మెల్యేకు లేదన్నారు. సభలో టీడీపీ రాష్ట్ర మహిళాకార్యదర్శి అరుణ కుమారి, నాయకులు రమాకాంతరెడ్డి, శశిరేఖ, బసలదొడ్డి ఈరన్న, పురుషోత్తం గౌడ్, గణేష్, తలారి అంజి, బోగ్గుల నరసన్న, సుధాకర్,వీరేష్ గౌడ్, చంద్ర, శివ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాఘవేంద్రరెడ్డి

వైసీపీని ఓడించండి : రఘునాథరెడ్డి

ప్రజలను మోసం చేసిన వైసీపీకి ఓటుతో బుద్ధి చెప్పి, ఇంటికి సాగనంపాలని మంత్రాలయం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాఘవేంద్రరెడ్డి సోదరుడు టీడీపీ సీనియర్ నాయకులు రఘునాథరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చెట్నహల్లి గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ చంద్రబాబు ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలపై ప్రజలకు వివరిస్తూ వైసీపీ చేసిన మోసాలను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. సమావేశంలో నాగరాజు, భీమిరెడ్డి, కేశన్న, బొజ్జప్ప, కౌలుట్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోండి

● ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

ఆదోని, ఏప్రిల్ 6: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ఆదోని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలోని రామాలయం దేవాలయం సమీపంలో ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ఆదోని నియోజకవర్గంలో 18 సంవత్సరాలు వచ్చిన వారు ఇంకా ఎన్రోల్ చేసుకోకపోతే ఏప్రిల్ 16 తేదీ వరకు ఎన్‌రోల్ చేసుకునే అవకాశం ఎన్నికల సంఘం మంజూరు చేసిందన్నారు. ఓటర్లు బాధ్యతగా వచ్చి ఓటు వేయాలనే ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, ఐసీడీఎస్ సీడీపీవో ఉమామశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు రూరల్ : ఓటు హక్కు ఉన్న వారంతా తప్పకుండా ఓటు వేయాలని ఎంపీడీవో కొండన్న అన్నారు. శనివారం గుడికల్లు గ్రామంలో స్వీప్ ఓటర్ అవేర్‌నెస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని నినదించారు. కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ వెంకటేష్, ఓటర్లు పాల్గొన్నారు.



ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ్‌నారాయణ్ శర్మ

మద్దికెర: మండలంలోని ఆయా గ్రామాల్లో 85 ఏళ్ల దాటిన వృద్ధులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓట్లు వేసుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందని తహసీల్దార్ రజాక్‌వలి తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల బీఎల్వోల సమావేశం నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

● టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు

కర్నూలు(అర్బన్), ఏప్రిల్ 6: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానని కర్నూలు టీడీపీ ఎంపీ అభ్యర్థి బస్తిపాటి కురువ నాగరాజు హామీనిచ్చారు. శనివారం కర్నూలు నగరంలోని తిలక్‌నగర్‌కు చెందిన పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీజీ భరత్‌తో పాటు ఎంపీ అభ్యర్థి బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా టీడీపీ పూర్తి స్థాయిలో బలోపేతమైందన్నారు. జగన్ ప్రభుత్వంలో ఒక్క రూపాయి పని చేసి 99 రూపాయాలు పబ్లిసిటి చేసుకుంటున్నారని ఆరోపించారు. సరైన ప్రభుత్వం, సరైన నాయకులు ఉంటేనే ప్రజల కష్టాలు తీరుతాయన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నిత్యం ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. మే 13 ప్రజలందరు తరలివచ్చి ఎంపీ, ఎమ్మెల్యే రెండు ఓట్లు సైకిల్ గుర్తుపై వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.



మాట్లాడుతున్న బస్తిపాటి నాగరాజు

కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎంఐఎం అధ్యక్షుడు

ఆదోని టౌన్, ఏప్రిల్ 6: ఎంఐఎం పార్టీ పట్టణ అధ్యక్షుడు ఉమ్మి యూసుఫ్ శనివారం సాయంత్రం ఎంఐఎంకు రాజీనామా చేసి, 30 మంది అనుచరులతో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సాయినాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నీలకంఠప్ప, దిలీప్ ధోక ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుతీరావు, ఐఎన్‌టీయూసీ నాయకుడు, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండీ నూర్ అహ్మద్, నిసార్, మాణిక్యరాజు, సుంకన్న పాల్గొన్నారు.

ఆలయంలో ఇష్టారాజ్యంగా పూజలు

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 6: మండలంలోని మసీదుపురం గ్రామంలో వెలసిన నరసప్పస్వామి (లక్ష్మీనరసింహ స్వామి ఆలయం) ఆలయంలో ఇష్టానుసారంగా పూజలు నిర్వహిస్తున్నట్లు భక్తులు ఆరోపిస్తున్నారు. దేవదాయశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా జరుగుతోందని భక్తులు పేర్కొంటున్నారు. శనివారం స్వామివారికి పూజలు నిర్వహించేందుకు బోడబండ, గుడికల్ గ్రామానికి చెందిన భక్తులు వచ్చారు. అయితే గుడికల్ భక్తులది ప్రధానపూజ(పెద్దపూజ) ఉందని చెప్పి మిగతా భక్తులను సాయంత్రం వరకు నిలిపివేశారు. దీంతో బోడబండకు చెందిన భక్తులు సాయంత్రం వరకు ఉండి పూజలు చేసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏనుగుబాలలో తాగునీటికి కటకట

ఎమ్మిగనూరు రూరల్, ఏప్రిల్ 6: ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఏనుగుబాల గ్రామంలో తాగునీటికి కటకట ఏర్పడింది. ప్రజలు తాగునీటిని తెచ్చుకునేందుకు పొలాల్లోని బోర్లను ఆశ్రయిస్తున్నారు. ఎండల తీవ్రతకు భూగర్భజలాలు తగ్గడంతో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తింది. కొత్త బోర్లు వేయించి నీటి సమస్యను పరిష్కరించాలంటే ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున కొత్త బోర్లను వేసేందుకు అవకాశం లేకుండా పోయింది. దీంతో గ్రామంలోని ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్థులను కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో కొండన్నను వివరణ కోరగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాల్లో సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు.



కొళాయి వద్ద నీటి కోసం నిరీక్షణ

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



తుగ్గలి, ఏప్రిల్ 6: తాగునీటి సమస్యతో ప్రజలు అల్లాడుతున్నారని.. దాత మిద్దె వెంకటేశ్ యాదవ్ బోరు వేయించి, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టారు. శనివారం జొన్నగిరిలో రూ.70వేలు ఖర్చుతో వెంకటేశ్ యాదవ్ శివాలయంలో నూతన బోరు వేయించి నీటి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో గ్రామస్థులు బాలన్న, రవి యాదవ్, ఫుల్లన్న, మల్లికార్జున, లక్ష్మీనారాయణ, రామక్రిష్ణ, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ద్వాదశి వేడుకలు



మంత్రాలయం, ఏప్రిల్ 6: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం ద్వాదశి వేడుకలను పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



టీడీపీ పథకాలను ప్రజలకు వివరిస్తున్న కేఈ శ్యాంబాబు

వెల్దుర్తి, ఏప్రిల్, 6: మండలంలో ఎస్. బోయినపల్లి గ్రామంలో శనివారం పత్తికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేఈ శ్యాంబాబు శంఖారావం కార్యక్రమం నిర్వహించారు. ముందుగా మాజీ సర్పంచ్, గ్రామనాయకుడు కాంతారెడ్డితో ఆయన స్వగృహంలో ఆత్మీయ సమావేశం నిర్వహించా రు. కేఈ.శ్యాంబాబు మాట్లాడుతూ ఒక్క చాన్స్ అంటూ సీఎం జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని పాతాళంలోకి నెట్టారని విమర్శించారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే చంద్రబాబుతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బలరాంగౌడ్, సుబ్బరాయుడు, జ్ఞానేశ్వర్‌గౌడ్, రమాకాంత్‌రెడ్డి, జయరాముడు, రామకృష్ణాచారి, రాముడు, ఆనంద్, అన్నసూరీడు, యాగంటి, అమర్‌నాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఏడీఏపై జేడీఏ విచారణ



ఏడీఏ కార్యాలయంలో మాట్లాడుతున్న జేడీఏ వరలక్ష్మి

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 6: ఎమ్మిగనూరు ఏడీఏ మహ్మద్ ఖాద్రీ అక్రమవసూళ్లు, వేదింపులకు పాల్పడుతున్నాడనే ఆరోపణలపై శనివారం జేడీఏ వరలక్ష్మి విచారణ చేపట్టారు. గోనెగండ్లకు చెందిన ఒక వ్యక్తి ఏడీఏపై వ్యసాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ మేరకే జేడీఏ స్థానిక ఏడీఏ కార్యాలయంలో డివిజన్ పరిదిలోని వ్యవసాయ అధికారులు, డీలర్లను పిలిపించి విచారణ చేశారు. ఈ విషయంపై జేడీఏను వివరణ కోరగా కార్యాలయం పరిదిలో అంతర్గతంగా చిన్న చిన్న సమస్యలు ఉన్నాయని చెప్పటం గమనార్హం.

నగదు సరఫరాపై దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో మురళి

మంత్రాలయం, ఏప్రిల్ 6: ఎన్నికల్లో ఆయా పార్టీలు అక్రమంగా డబ్బు, మద్యం, ఇతరత్రా వస్తువుల రూపంలో ఓటర్లను మభ్యపెట్టేందుకు సరఫరా చేస్తున్న వారిపై నిఘా పెట్టి జాగ్రత్త తీసుకోవాలని మంత్రాలయం ఎన్నికల రిటర్నింగ్ అధికారి మురళి, అసిస్టెంట్ ఆర్వో శ్రీధర్‌మూర్తి అన్నారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సెక్టోరల్ అధికారులు, పోలీసులతో తహసీల్దార్లుతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ 85 సంవత్సరాలు పైబడిన ఓటర్లు, వికలాంగులు పోలింగ్ కేంద్రాలకు రాకుండా, వారికి హోంలోనే ఓటింగ్ పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేయించేందుకు అధికారులు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో మంత్రాలయం, కోసిగి సీఐలు ఎరిషావలి, ప్రసాద్, ఏఎస్ఐ ఆనందరెడ్డి, మూడు మండలాల తహసీల్దార్లు, డీటీలు రాఘవేంద్ర, శశిశేఖర్ రావు, రామయ్య, పెద్దయ్య, క్రిష్ణయ్య, ఆనంద్, ఆదాం,తదితరులు పాల్గొన్నారు.

సభలకు అనుమతులు అవసరం

పత్తికొండ టౌన్, ఏప్రిల్ 6: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, ర్యాలీలకు ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ మురళి మోహన్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పత్తికొండ నియోజకవర్గం అంతా 30 పోలీస్ యాక్టు అమలులో ఉందని, దీనిని దృష్టిలో పెట్టుకుని రాజకీయ పార్టీల నాయకులు సభలు, ర్యాలీలు ప్రచారం సంబంధించి అధికారులతో ముందస్తు అనుమతులు తీసుకోవాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

మద్యం పట్టివేత

ఎమ్మిగనూరు, ఏప్రిల్ 6: ఎమ్మిగనూరు పట్టణంలోని వెంకటాపురం కాలనీలో అక్రమంగా అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మద్యం ఉందన్న సమాచారంతో సెబ్ సీఐ భార్గవరెడ్డి ఆధ్వర్యంలో సెబ్ పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన పీ ఆంజనేయులు అనే వ్యక్తి ఇతర రాష్ట్రాలకు చెందిన మద్యంను తెచ్చి ఎమ్మినూరు పట్టణంలో విక్రయిస్తున్నాడన్న సమాచారంతో నిఘా పెట్టామన్నారు. ఈక్రమంలో శనివారం అతనిపై దాడిచేసి పట్టుకోవటం జరిగిందన్నారు. అతని వద్దనుంచి అరుణాచల్ రాష్ట్రానికి చెందిన రాయల్ స్టాగ్ డీలక్స్ మద్యం 23బాటిల్స్‌ను స్వాధీనం చేసుకోవటం జరిగిందన్నారు. అతనిపై కేసునమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా పాపమాంబ రథోత్సవం

ఆదోని టౌన్, ఏప్రిల్ 6: స్థానిక మరాఠీవీధి, వెలసిన పాపమాంబ అమ్మవారి 68వ ఆరాధన ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. ఆంధ్ర, తెలంగాణ, రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని తమ మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పురవీధులలో ఊరేగించారు.



పాపమాంబ రథోత్సవంలో పాల్గొన్న భక్తులు